క్లుప్తంగా

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలి

అమలాపురం టౌన్: డ్వాక్రా సంఘాల మహిళా సభ్యులు ఇళ్ల వద్ద కుటీర పరిశ్రమల ద్వారా తయారు చేసే ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు అన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను కమిషనర్ రాజు బుధవారం ప్రారంభించి ప్రసంగించారు. మహిళలు స్వయం ఉపాధి కోసం బ్యాంక్‌ల ద్వారా రుణాలు తీసుకుని స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను ఈ బజార్‌లో ప్రదర్శించడంతో పాటు విక్రయానికి ఉంచారు. పట్టణానికి చెందిన వినియోగదారులు మెప్మా బజార్‌ను సందర్శించి పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. బజార్‌లో లభ్యమయ్యే ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆ మహిళల జీవనోపాధికి సహకరించాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మోహన్‌కుమార్ కోరారు. మెప్మా జిల్లా కార్యాలయ ప్రతినిధి సీహెచ్.శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, 30 వార్డుల రిసోర్స్ పర్సన్లు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు నమోదును పూర్తి చేయాలి



నమోదు తీరును పరిశీలిస్తున్న బోసుబాబు

అల్లవరం: రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు ఆదేశించారు. మండలంలోని అల్లవరం గ్రామంలో జరుగుతున్న రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణాధి కారి శుభ గణేష్, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జి పాటి సింహాద్రి, వీఏఏలు వెంకట ఈశ్వర్, యుగ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

యానాం: పట్టణ పరిధిలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శేరు శ్రీనివాస్(59) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, పలువురు ఉపాధ్యాయులు సందర్శించి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

శ్మశాన వాటికలో శివుని విగ్రహ ప్రతిష్ట



శ్మశాన వాటికలో ప్రతిష్ఠించిన శివుని విగ్రహం వద్ద ట్రస్ట్ సభ్యులు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలోని హిందూ శ్మశానవాటికలో గ్రామ ముక్తిదాం ట్రస్ట్ ఆధ్వర్యంలో పరమశివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్తుల సహకారంతో బుధవారం శ్మశాన వాటిక సుందరీకరణ, సదుపాయాల కల్పనలో భాగంగా ప్రహరీ, నీటి సదుపాయం, విశ్రాంతి మందిరం, సిమెంట్ కుర్చీలు, మొక్కల పెంపకం చేపడతామని ముక్తిదాం ట్రస్ట్ పర్యవేక్షకులు కొండా బ్రహ్మానందం తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన దీక్ష



విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలో సిబ్బంది

యానాం: పుదుచ్చేరి విద్యుత్ శాఖ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఖాళీ పోస్టుల భర్తీని కోరుతూ పుదుచ్చేరి ఎలక్ట్రికల్ ఇంజినీర్లు, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం యానాం విద్యుత్ శాఖ ఉద్యోగులు స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వందలాదిగా ఖాళీగా ఉన్న విద్యుత్ ఇంజినీర్లు, కార్మికుల పోస్టులను భర్తీ చేయకుండా ఏళ్లుగా కాలయాపన చేస్తున్నారన్నారు. ఏడవ వేతన సంఘం సూచనల మేరకు వేతనాలను ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆబోతును రక్షించిన అగ్ని మాపక సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన సమీపంలో ఓ మున్సిపల్ డ్రైయిన్‌లో బుధవారం ఓ ఆబోతు ప్రమాద వశాత్తూ పడి కొన్ని గంటల పాటు ఇబ్బంది పడింది. డ్రైయిన్‌లో ఆబోతు అవస్థలు చూసి స్థానికుడైన నూకల శివ అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకుని డ్రైయిన్‌లోని ఆబోతును చాకచక్యంగా బయటకు తీశారు. అగ్నిమాపక దళాధికారి మురళీ కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమించి ఆబోతును బయటకు తీశారు.

బోధన వంటపట్టేదెలా..!

- వంటగదిలో విద్యార్థులకు విద్యా బోధన
- ఐదు తరగతులకు రెండే గదులు
- ఒకటి కమ్యూనిటీ హాలు, రెండోది వంటగది
- బాబానగర్ పాఠశాల దుస్థితి
- పాత భవనం కూల్చివేసి ఏడాది పూర్తి
- ఇదీ సర్కారు బడుల నిర్వహణ తీరు

తాళ్లరేవు: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అధికారులు విస్తృత ప్రచారం చేస్తుంటారు. అధికారుల ఆర్భాటమే తప్పా ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం మౌలిక సదుపాయాలు కానరావడం లేదు. కనీసం విద్యాబోధన చేసేందుకు తరగతి గదులు కూడా లేకపోవడం గమనార్హం. పాఠశాలలకు సరైన భవనాలు సైతం లేకపోవడంతో పరాయి పంచన విద్యాబోధన సాగించాల్సిన దుస్థితి ఎదురవుతోంది. మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో గ్రామ కమ్యూనిటీ హాలులో విద్యాబోధన సాగిస్తున్నారు. గతంలో ఉన్న పాఠశాల భవనాన్ని పునర్ నిర్మించేందుకు గానూ ఉన్న పాఠశాలను తొలగించారు. అయితే తొలగించి ఏడాదికి పైగా గడుస్తున్నా నూతన భవనం నిర్మించలేదు. దీంతో సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాలులో విద్యాబోధన చేస్తున్నారు. ఐదు తరగతులు ఒకే గదిలో



పాఠశాలగా మారిన కమ్యూనిటీ హాలు



నిర్మాణం లేక ఖాళీగా దర్శనమిస్తున్న పాఠశాల స్థలం

నిర్వహిస్తున్నారు. ఈ హాలులోనే ఓ తరగతికి ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతుండగా, మరోవైపు వేరే ఉపాధ్యాయుడు మరో తరగతికి పాఠాలు చెప్పాల్సిన దుస్థితి. ఈ సమయంలో మిగతా మూడు తరగతుల విద్యార్థులు ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి. దీంతో విద్యా బోధనకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇలా ఉండగా నాడు–నేడు పనుల్లో భాగంగా మరుగుదొడ్లు, వంటగది నిర్మించారు. అయితే విద్యార్థుల ఇబ్బందుల నేపథ్యంలో వంటగదిని కూడా తరగతి గదిగా మార్చి ఇటీవల తరగతులు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా వంటగది లేకపోవడంతో ఇంటి వద్దనుంచే వండి తీసుకువస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నామని, వంటగది నిర్మాణంతో తమ ఇబ్బందులు తొలగుతాయనుకుంటే మళ్లీ పరిస్థితి మొదటికే వచ్చిందని మధ్యాహ్న భోజనం తయారీదారులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాల భవనం నిర్మించాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని వాపోతున్నారు.

నియోజకవర్గంలోని మరి కొన్ని పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి ఉందని పలువురు చెబుతున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బాబానగర్‌లో నూతన పాఠశాల భవనం తక్షణమే నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై మండల విద్యాశాఖాధికారి మంగాయమ్మను వివరణ కోరగా పాఠశాల భవనం పునర్ నిర్మించేందుకు భవనాన్ని తొలగించామని అయితే నిధులు మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణం పూర్తి కాలేదన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభించాలి



పాఠశాల భవనాన్ని కూల్చేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు నిర్మించకపోవడం దారుణం. భవనం లేక కమ్యూనిటీ హాలులో తరగతులు నిర్వహిస్తున్నారు. వంటగదిలో సైతం తరగతులు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలా ఉండగా పాఠశాల ప్రాంగణంలోకి కుక్కలు, పందులు వచ్చి విద్యార్థులను గాయపరుస్తున్నాయి. తక్షణమే పాఠశాల భవనంతో పాటు ప్రహరీ నిర్మాణం చేయాలి.

వడ్డి ఏడుకొండలు, విశ్వజన కళామండలి అధ్యక్షుడు, బాబానగర్, సుంకరపాలెం.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



పాఠశాల భవనం పునర్ నిర్మాణానికి గానూ భవనాన్ని కూల్చివేశారు. దీంతో పక్కనే ఉన్న కమ్యూనిటీ హాలులో తరగతులు నిర్వహిస్తున్నాం. అయితే అన్ని తరగతులకు ఒకే గదిలో తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్మించిన వంటగదిలో సైతం తరగతులు నిర్వహిస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

వైదాడి నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు.

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు



విద్యార్థులంతా ఒకే గదిలో ఉండడంతో ఏకాగ్రత చూపలేక పోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు అల్లరి చేస్తుండడంతో వారిని వారించడంతోనే రోజు గడిచిపోతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని తరగతులకు గదులు ఉండేలా పాఠశాల భవనాన్ని నిర్మించాలి.

సత్తిబాబు, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్.

ఏళ్లుగా ఇబ్బందులు



పాఠశాలలో వంటగది లేకపోవడంతో గత 20 ఏళ్లుగా ఇంటి వద్దనే వండి ఇక్కడకు తీసుకు వస్తున్నాం. గత ఏడాది వంటగది నిర్మించారు. కష్టాలు తీరతాయి అనుకునే తరుణంలో పిల్లల చదువులకు వంటగదిని కూడా తరగతి గదిగా మార్చేశారు. మా కష్టాలు ఎప్పటిలానే ఉన్నాయి.

గంగారత్నం, మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు.

కూటమి రాజ్యం.. భూముల భోజ్యం

- అనధికార లే అవుట్‌కు నేతల అండ
- పట్టించుకోని పట్టణ ప్రణాళిక అధికారులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అనధికారికంగా వెలుస్తున్న లే అవుట్ల విషయంలోనూ అదే పంథాను కొనసాగిస్తున్నారు. అనధికార లే అవుట్లు వేసే వారికి కూటమి ప్రభుత్వంలోని కొందరు నేతల అండదండలు సైతం తోడవడంతో నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. స్థానిక దుడ్డివారి అగ్రహారంలో ఒక ఎకరా 63 సెంట్ల భూమిలో ఓ అనధికార లే అవుట్ ఏర్పాటుకు చకచకా పనులు జరిగిపోతున్నాయి. ఆ లే అవుట్ భూమిని ఇళ్ల నిర్మించుకునేందుకు వీలుగా నిత్యం పలు లారీలు, ట్రాక్టర్లతో మట్టి తోలుతున్నా అధికారులకు కనీస సమాచారం లేకపోవడం, వారి దృష్టికి వచ్చినా రానట్లు నటించడం గమనార్హం. అనధికార లే అవుట్‌ను మట్టితో ఎత్తు చేస్తూ రేపోమాపో ప్లాట్లుగా విడగొట్టి ఇళ్ల స్థలాలుగా అమ్మేందుకు సిద్ధమవుతున్న రియల్టర్లు కనీసం ఆ భూమిని వ్యవ



అమలాపురం దుడ్డివారి అగ్రహారంలో వెలసిన అనధికార లే అవుట్

సాయ భూమి నుంచి వ్యాపార అవసరాలకు మార్చుతున్నట్లు కన్వర్షన్ కూడా చేయలేదు. ఫలితంగా ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని సైతం వారు ఆవిరి చేస్తున్నారు. అనధికార లే అవుట్ నిర్మిస్తున్న ఎకరా 63 సెంట్ల భూములకు ముగ్గురు భూ యజమానులు ఉన్నారు. రియల్టర్లు తమ నుంచి సరైన అంగీకారం తీసుకోకుండానే ప్లాట్ల అమ్మకాలకు సిద్ధమవుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేవు

దుడ్డివారి అగ్రహారంలో వేస్తున్న లే అవుట్ అనధికారికంగా ఏర్పాటు చేసినదేనని పట్టణ ప్రణాళిక విభాగం ఇన్‌చార్జి టీపీవో రాణి సంయుక్త తెలిపారు. ప్రస్తుతానికి వారు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

అమలాపురం టౌన్: స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో మెయిన్ రోడ్డు చెంత గల సకల కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి బుధవారం ఘనంగా జరిగింది. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ప్రతినిధులు ఈ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలత ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి ధార్మిక సంస్థల ప్రతినిధులు పూల మాలలు వేసి పూజలు చేశారు. శివాజీ జయంతి కేవలం ఒక ఉత్సవమే కాదని భారతీయ సంస్కృతి, ఆత్మ గౌరవం, ధైర్యానికి ప్రతీక అని వారు పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ అంటే ఓ వ్యక్తి కాదని ఓ శక్తి అని గుర్తు చేశారు. విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు కొప్పుల భాస్కరరావు, పూటుకూరి సాంబయ్య, పిచ్చిక సుబ్బారావు, గంగుమళ్ల దొరబాబు, కొప్పుల నాయుడు, యక్కల బ్రహ్మేష్, పూటుకూరి మురళీ, సూర్యభగవాన్ తదితరులు పాల్గొన్నారు.



శివాజీ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ప్రతినిధులు

ప్రమాదకరంగా వంతెన రైలింగ్

ఉప్పలగుప్తం: అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలను కలిపే సరిపల్లి వంతెన రైలింగ్ ప్రమాదకంగా మారింది. ఈ వంతెనను చల్లపల్లి ప్రధాన పంట కాలువపై పడవలు వెళ్లేందుకు అనుగుణంగా దశాబ్దాల క్రితం ఎత్తుగా నిర్మించారు. వంతెనపై అనునిత్యం వాహన చోదకులు ప్రయాణిస్తుంటారు. ఎత్తు ప్రాంతం నుంచి వాహనాలకు ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన రైలింగ్ ప్రస్తుతం శిథిలా వ్యవస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా ప్రయాణించే ప్రయాణికులు ఏమాత్రం ఆదమరచినా వాహనాలు ప్రమాదానికి గురై చల్లపల్లి ప్రధాన రహదారిపై పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సరిపల్లిలో ప్రమాదకరంగా మారిన వంతెన రైలింగ్

వైభవంగా శ్రీదేవి అమ్మవారి జన్మదిన మహోత్సవాలు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లో వేంచేసి యున్న శ్రీదేవి ఆలయంలో అమ్మవారి జన్మదిన మహోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. 23వ తేదీ వరకూ అయిదు రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో పలు హోమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు తెలిపారు. తొలి రోజు బుధవారం అమ్మవారి సన్నిధిలో ఆవుపాలు, ఆవు పెరుగుతో అభిషేకంతో పాటు పలు హోమాలు నిర్వహించారు. ఈ హోమాలను తిలకించేందుకు, అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తుల తరలివచ్చారు. స్మార్త పండితులు బ్రహ్మశ్రీ భళ్లమూడి దివాకర శాస్త్రి ఆధ్వర్యంలో 11 మంది స్మార్త పండితులు ఈ క్రతువులను జరిపిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వెలవెలపల్లి వెంకట శివకుమార్ అమ్మవారి వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు.



అమ్మవారి సన్నిధిలో హోమాలు నిర్వహిస్తున్న పండితులు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

అమలాపురం రూరల్: మండలంలో గున్నేపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన విప్పర్తి ములగారావు అనారోగ్యంతో బాధ పడుతూ ఇటీవల ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ. 1,27,249 చెక్కును బాధితుడికి సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు బుధవారం అందజేశారు.

వైభవంగా గణపతి హోమం



లక్ష్మీ గణపతి ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లిలో వేంచేసి యున్న లక్ష్మీ గణపతి స్వామి ఆలయ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద గణపతి హోమం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు సింహాచలం శర్మ, నటరాజ్ స్వామి ఆధ్వర్యంలో స్వామికి మండపారాధన, విశేష ద్రవ్య అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. కొంకాపల్లి వాసులే కాక పట్టణంలోని పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు.

సత్తెమ్మ తీర్థ మహోత్సవాలు ప్రారంభం

ముమ్మిడివరం: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు బాజా భజంత్రీలు, గరగ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి జాతర నిర్వహిస్తారు. ఈ నెల 23న అమ్మవారి తీర్థ మహోత్సవాలు వైభవోపేతంగా జరగనున్నాయి. దీనిలో భాగంగా అమ్మవారి భారీ ఊరేగింపు జరగనుంది. ఈ ఉత్సవాల్లో సుమారు 2వేల మంది కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

ఎన్నికల నియమావళికి తిలోదకాలు

అల్లవరం: ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కూటమి నేతలు అధికారుల విధులను ఆటంక పరచి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. విధులు నిర్వహించే సమయంలో ఎన్నికల ప్రచారం చేయకూడదన్న నిబంధనను అల్లవరం ఎంపీడీఓ బీఎస్ఎస్ కృష్ణప్రసాదు విస్మరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు సత్తిబాబురాజు ఆధ్వర్యంలో బుధవారం అల్లవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచారంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ కృష్ణప్రసాదు, ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కార్యదర్శి రాజమోహన్‌లకు ఎన్నికల ప్రచార బ్రోచర్‌లను అందించి ఓటు అభ్యర్థించారు. టీడీపీ నేతలు ఇచ్చిన బ్రోచర్‌ని ఎంపీడీఓ ప్రదర్శించడం కోడ్ ఉల్లంఘనేనని పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన అధికారులే కోడ్ ఉల్లంఘన చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ కృష్ణప్రసాదు

చురుగ్గా వెంకన్న ఆలయ నిర్మాణ పనులు

యానాం: టీటీడీ ఆధ్వర్యంలో యానాంలో కొలువైన భూ సమేత వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని త్వరలోనే భక్తుల దర్శనానికి అందుబాటులోకి తీసుకువస్తామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం తిరుపతి నుంచి వచ్చిన టీటీడీ దేవస్థానం ఇంజినీరింగ్ బృందంతో కలిసి ఆలయ పనుల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో టీటీడీ దేవస్థానం ఇంజినీర్లు, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, ఈఈ సురేంద్రనాథ్, స్థపతి కృష్ణారావు, ఎలక్ట్రికల్ ఈఈ రవిశంకర్‌రెడ్డి, ఆలయ అధికారి రామకృష్ణ, కమిటీ ప్రతినిధులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



టిటిడీ ఉద్యోగులతో మాట్లాడుతున్న మల్లాడి

పెచ్చులూడుతున్నాయ్.. పట్టించుకోరూ!

- శిథిలావస్థకు చేరిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- నూతన భవనం నిర్మించాలని స్థానికుల వినతి

ఐ.పోలవరం: పెచ్చులూడిన శ్లాబులు.. వర్షానికి లీకవుతున్న నీరు.. ఊడిపోయిన మరుగుదొడ్ల తలుపులు.. చూసేవారికి పాడుపడిన భవనాన్ని తలపిస్తోంది ఐ.పోలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. మండల కేంద్రం ఐ.పోలవరంలో దీనిని 1975 ఆగస్టు 26వ తేదీన ప్రారంభించారు. నాటి నుంచి ఇది అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ భవనం దాదాపు శిథిలావస్థకు చేరింది. శ్లాబ్‌తో పాటు భవనం చుట్టూ ఉన్న సన్‌షేడ్ శ్లాబ్ సహితం పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం నీరు లీకవుతోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు కార్యాలయంలోని రికార్డులు, ఇతర ఫైళ్లు తడిసి ముద్దవుతున్నాయి. మరుగుదొడ్ల తలుపులు సైతం ఊడిపోయాయి. కొత్త భవనం నిర్మాణానికి స్థానిక రైతుల సహకారంతో 12 సెంట్ల భూమిని 1992లో కొనుగోలు చేశారు. అయినప్పటికీ నాటి నుంచి సొంత భవన నిర్మాణం చేపట్టలేదు. భవనం ఇలా ఉండడంతో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పుడప్పుడూ విష జంతువులు సైతం లోనికి ప్రవేశిస్తుండడంతో సిబ్బంది భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే వసతులతో కూడిన మరో భవనంలోనికైనా తరలించాలని పలువురు విన్నవిస్తున్నారు.



శిథిల భవనంలో ఐ.పోలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



తలుపులూడి అధ్వానంగా మారిన మరుగుదొడ్లు

చికిత్స పొందుతూ మహిళ మృతి

అమలాపురం టౌన్: స్థానిక చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో నివాసం ఉంటున్న కందాల లక్ష్మీ నరసమ్మ (56) ఇంట్లో పూజ చేసుకున్న దీపారాధన ప్రమాద వశాత్తూ చీరకు అంటుకోవడంతో ఈ నెల 1వ తేదీన గాయాల పాలైంది. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. చికిత్స పొందుతూ బుధవారం నరసమ్మ మృతి చెందినట్లు పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త రామాంజనేయాచార్యులు ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లిలోని ఓ ఆలయంలో పూజారిగా పని చేస్తున్నారు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఐ.పోలవరం: నూతనంగా నిర్మిస్తున్న 11 కేవీ లైను నిర్మాణ పనుల నిమిత్తం ఐ.పోలవరం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్, 11 కేవీ గుత్తినదీవి ఫీడర్ సరఫరాలను శుక్రవారం నిలిపి వేయనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు తెలిపారు. ఈ కారణంగా జి.మూలపాలెం, ఎరగ్రరువు, చిన్న కొడప గ్రామాలతో పాటు దుప్పలంక ఏటిగట్టు ఆక్వా చెరువులు, జి.వేమవరం ఏటిగట్టు ఆక్వా చెరువులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.